క్లుప్తంగా

గణపతి ఉత్సవాల్లో నిబంధనలు పాటించాలి

దుగ్గొండి : గణపతి నవరాత్రి ఉత్సవాల్లో నిర్వాహకులు నిబంధనలు పాటించాలని ఎస్సై రావుల రణధీర్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆయన మాట్లాడారు. నవరాత్రి ఉత్సవాలు నిర్వహించే గణపతి మండప నిర్వాహకులు ముందుగా పోలీస్ అనుమతికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే అనుమతులు జారీ చేస్తామన్నారు. విద్యుత్ సరఫరా కోసం విద్యుత్‌శాఖ అనుమతి ఉండాలని, 24 గంటల పాటు ఒక వలంటీర్ అందుబాటులో ఉండాలని తెలిపారు. శబ్ద కాలుష్యం నివారణకు డీజేలు, సౌండ్ బాక్సులు నిషేధించామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

అందని పశువైద్య సేవలు



తాళం వేసి ఉన్న ప్రాంతీయ పశు వైద్యశాల

వర్ధన్నపేట : సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న సమయంలో ప్రాంతీయ పశువైద్య శాల సేవలు అందక పాడి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సిబ్బంది మధ్యాహ్నం వరకే అందుబాటులో ఉంటూ ఆ తర్వాత వైద్యశాలకు తాళం వేసి వెళ్లి పోతున్నారు. దీంతో రైతులు ప్రైవేట్ వైద్యులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఉన్నతాధికారులు వెంటనే చొరవ తీసుకొని వైద్యశాలలో సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా చూడాలని కోరుతున్నారు.

రుక్సానాకు పీహెచ్‌డీ ప్రదానం



ఖానాపురం : మండలంలోని ధర్మరావుపేటకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ రుక్సానా పీహెచ్‌డీ పట్టా పొందారు. గ్రామానికి చెందిన రుక్సానా మహ్మద్ వాణిజ్య శాస్త్ర విభాగంలో ఈనెల 19న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా పీహెచ్‌డీ అందుకున్నారు. విశ్వవిద్యాలయ స్థాయిలో గుర్తింపు పొందడంతో గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

నల్లబెల్లి : తెలంగాణ ఆటో యూనియన్ నల్లబెల్లి నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రెడ్డి ప్రశాంత్, గౌరవ అధ్యక్షుడిగా బసవరాజుల శ్రీను, ఉపాధ్యక్షుడిగా కామెర ప్రశాంత్, కార్యదర్శిగా నద్దునూరి మహేందర్, కోశాధికారిగా సామల సారంగం, సహాయ కార్యదర్శిగా మర్రి ఐలయ్యలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్ల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

రోడ్లపై వాహనాలు.. తప్పని ట్రాఫిక్ సమస్యలు



పర్వతగిరి : పర్వతగిరి మండల కేంద్రం నుంచి వరంగల్ వైపునకు వెళ్లే ప్రధాన రోడ్డుపై వాహనాలు నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు, స్థానికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధాన రహదారి వద్ద రోడ్డుపై రేకుల షెడ్లు వేయడం, వాటి పక్కన వాహనాలు పార్కింగ్ చేయడం, రోడ్డు ఇరుకుగా ఉండడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి రోడ్డుకు దగ్గరలో ఉన్న రేకుల షెడ్లను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

పర్వతగిరి : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ మాలోత్ శంకర్ నాయక్ సూచించారు. పర్వతగిరిలో బుధవారం ఇందిరమ్మ ఇళ్లను ఆయన పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శి రఘు, సిబ్బంది పాల్గొన్నారు.

చేయూత

రాయపర్తి : మండలంలోని మొరిపిరాలకు చెందిన ఓరుగంటి రాములు, శివరామపురంలో కాయితోజు భద్రమ్మ ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబాలను బీఆర్‌ఎస్ నాయకులు, ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ సభ్యులు బుధవారం పరామర్శించారు. అనంతరం ఫౌండేషన్ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి బియ్యం, వంట సామగ్రితో పాటు ఆర్థికసాయం అందించారు.

సన్మానం

పర్వతగిరి : స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డులు అందుకున్న ఎస్సై ప్రవీణ్, కానిస్టేబుల్ అనన్యను స్వేరోస్ మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం శాలువాతో సన్మానించారు. స్వేరోస్ పర్వతగిరి మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎద్దు రాహుల్, ధరావత్ జీవన్ ఆధ్వర్యంలో అభినంద, సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

జాగ్రత్తలతోనే జీవాలకు రక్షణ

- సీజనల్ వ్యాధుల బారిన పశువులు
- చిత్తడితో కాలిపుండు రోగాలు
- పశువైద్యశాలల్లో నివారణ టీకాలు



పశువుకు గాలికుంటు నివారణ టీకా వేస్తున్న డాక్టర్ రాజు

సంగెం : సీజనల్ వ్యాధులతో మనుషులకే కాదు.. మూగజీవాలకు సైతం ముప్పు తప్పదు. మండల వ్యాప్తంగా అనేక మంది రైతులు పాడిపశువులు, మూగజీవాల పోషణనే ఆధారంగా జీవిస్తున్నారు. పశువులకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోక పోవడంతో పశువులు, జీవాలను కోల్పోతుంటారు. వర్షాలకు మొలకెత్తిన పశుగ్రాసాన్ని తినడం, పుర్రు రావడం, శరీరానికి మేత ఇమడకపోవడం వంటి లక్షణాలతో జీవాలు రోగాల బారిన పడుతుంటాయి. వరంగల్ జిల్లాలో ఆవులు 7,850, గేదేలు 8,971, గొర్రెలు 48,348, మేకలు 8,452, పందులు 2,350, కుక్కలు 355, కుందేళ్లు 95 ఉన్నాయి. అయితే పలు ముందస్తు జాగ్రత్తలతో రైతులు తమ పశువులు, జీవాలకు వ్యాధులు సోకకుండా కాపాడుకోవచ్చని సంగెం మండల పశువైద్యాధికారి రాజు సూచిస్తున్నారు.

జబ్బవాపు..

వయస్సులో ఉన్న ఆరోగ్యవంతమైన పశువులు, తెల్లజాతి పశువులకు ఈ జబ్బవాపు వ్యాధి సోకుతుంది. ఇది సంక్రమించిన పశువులు అధిక జ్వరంతో బాధపడుతుంటాయి. మేత మేయక, నిత్యం పడుకునే ఉంటుంది. జబ్బ భాగం వాచి, నల్లగా కములు తుంది. అక్కడ కండరాలు ఉబ్బుతాయి, వాటిలో గాలి బుడగలు, నీరు చేరి తీవ్రమైన నొప్పితో విలవిలాడుతుంటుంది. వాపు ఉన్న చోట చేతితో తాకితే గరగరమని శబ్దం వస్తుంది. సకాలంలో వైద్యం అందించకపోతే పశువు నీరసించి, చనిపోతుంది.

గొర్రెల్లో కాలిపుండ్లు..

వర్షాకాలంలో గొర్రెలు బురదలో తిరగడం వల్ల కాలిపుండ్ల వ్యాధి సోకుతుంది. గిట్టల మధ్య చర్మం మెత్తబడి, వాచి చిట్లుతుంది. ఈము పట్టి నొప్పితో ముందు కాళ్లపై గెంటుతాయి. వ్యాధి ముదిరితే గిట్టలూడిపోతాయి. ఇది సోకిన జీవాలకు 10 శాతం మైలతుత్తం, 1శాతం జింక్‌సల్ఫేట్, లేదా ఐదు శాతం ఫార్మలిన్‌లో ఏదైనా ఒక అయిట్‌మెంట్ పూయాలి. యాంటి బయాటిక్‌ను వరుసగా 3–5 రోజుల పాటు వేయించాలి. గొర్రెలను బురద నేలల్లో ఎక్కువగా తిరగనియొద్దు.

గురక వ్యాధి..

ప్రస్తుత కాలంలో పశువులకు సోకే ప్రాణాంతక వ్యాధుల్లో గొంతువాపు (గురక) ఒకటి. దీని బారిన పడిన జీవాలకు అకస్మాత్తుగా అధిక జ్వరం వస్తుంది. మేత మేయక గొంతుపై, మెడకింద వాపు కన్పిస్తుంది. అదే సమయంలో గురక శబ్దం వస్తుంది. నోరు, ముక్కు నుంచి ద్రవం కారుతు వణుకుతూ ఉంటుంది. కళ్లు ఎర్రబడి నీరు కారుతుంది. పాడి పశువుల్లో పాలదిగుబడి తగ్గుతుంది. వ్యాధి తీవ్రత ఎక్కువైతే ఎడతెరిపి లేకుండా దగ్గుతూ, అపస్మారక స్థితికి వెళ్లి చనిపోతుంది.

దోమలు దాడి చేస్తే..

నేల చిత్తడిగా, వాతావరణం అపరిశుభ్రంగా ఉన్న ప్రదేశంలో నీరు నిల్వ ఉన్న గుంతలు, మురుగునీటి కాల్వల్లో ఈగలు, దోమలు పెరుగుతాయి. ఇవి ఆహారం కోసం పశువులపై దాడి చేస్తుంటాయి. పశువుల శరీరంపై వాలి రక్తాన్ని పీల్చుతాయి. ఈగలు, దోమకాటు వల్ల పశువు శరీరంపై పుండ్లు ఏర్పడుతాయి. అందుకు పశువుల పాకలు, నిల్వ ఉన్న ప్రదేశాల్లో డీజిల్‌ను పిచికారీ చేయాలి. బ్లీచింగ్ పౌడర్ చల్లాలి. ఉదయం, సాయంత్రం వేళల్లో ఎండుపిడుకలు, వేపాకులతో పొగపెడితే ఈగలు, దోమలు తగ్గుతాయి.

గాలికుంటు వ్యాధి..

గాలికుంటు వ్యాధి సోకిన పశువు చాలా బలహీనంగా ఉండి, నీరసించి పోతుంటాయి. పాల ఉత్పత్తి తగ్గుతుంది. సాగు పనులకు సహకరించవు. సంకరజాతి పశువులతో పాటు షెడ్లలో పెంచుకునే వాటికి సైతం ఇది వ్యాప్తిస్తుంది. మార్చి, ఏప్రిల్, సెప్టెంబర్, అక్టోబర్‌లో ఈ వ్యాధి ఎక్కువగా సోకే ప్రమాదం ఉంది. పశువులకు నోరు, గిట్టల మధ్య బొబ్బలు ఏర్పడుతాయి. 3, 4 వారాల్లో బొబ్బలు పగిలి పుండ్లుగా, చర్మం గరుకుగా మారుతుంది. నోటి చిగుళ్లపై పొక్కులు ఏర్పడి మేత తీసుకోలేక నీరసించి పోతాయి. నోటి నుంచి చొంగ కారుతుంది.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

ఎడతెరిపి లేని వర్షాలతో రైతులు తమ పశువులకు సీజనల్ వ్యాధులు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యాధుల నివారణకు మందులు పంపిణీ చేస్తున్నాం. గొర్రెలు, మేకల్లో నీలినాలుక, కాలిపుండ్లు, గురక వ్యాధి, తెల్లజాతి పశువుల్లో గాలికుంటు, మృతచర్మ వ్యాధి, పుర్రు రోగం ఎక్కువగా వ్యాపిస్తుంటాయి. వ్యాధుల నివారణకు పశువైద్యశాలలో వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టాం.

– వల్లె రాజు, పశువైద్యాధికారి, సంగెం

'యూరియా కోసం పడిగాపులు సిగ్గుచేటు'



రాస్తారోకోను అడ్డుకుంటున్న పోలీసులు, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, రైతులు

ఖానాపురం: జిల్లా వ్యాప్తంగా ఒక్కరోజే 20 వేల మంది రైతులు యూరియా కోసం పడిగాపులు కాయడం సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. యూరియా కావాలని డిమాండ్ చేస్తూ బుధరావుపేట జాతీయ రహదారిపై రైతులతో కలిసి బుధవారం ఆయన రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా పెద్ది మాట్లాడుతూ వ్యవసాయ ప్రణాళిక తయారీలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతులు ఇబ్బందులు పడుతుంటే జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. కమీషన్లపై ఉన్న ప్రేమ రైతులపై లేకపోవడం బాధాకరమన్నారు. అధిక భూములు కలిగిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు క్యూలైన్లలో నిలబడకున్నా యూరియా బస్తాలు, టోకెన్లు ఎక్కడి నుంచి వస్తున్నాయని ఆయన ప్రశ్నించారు. యూరియాను బ్లాక్‌కు తరలించడంలో కాంగ్రెస్ పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. అనంతరం సొమ్మసిల్లిపడిపోయిన అలీపాషా, మహిళా రైతులను పరామర్శించారు. మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు మహలక్ష్మి వెంకటనర్సయ్య, నాయకులు బంధారపు శ్రీనివాస్, పసునూరి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల తప్పుడు ప్రచారం

- పార్టీ మండల అధ్యక్షుడు హరిబాబు



సమావేశంలో మాట్లాడుతున్న జగన్‌మోహన్‌రెడ్డి

ఖానాపురం : బీఆర్‌ఎస్ నాయకుల తప్పుడు ప్రచారంతోనే రైతుల్లో భయం నెలకొందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్‌మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు హరిబాబు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో 25,555 బస్తాల యూరియా రాగా ప్రస్తుతం 28,416 బస్తాల యూరియా రైతులకు అందించామని పేర్కొన్నారు. మహిళలతో అధికారుల కాళ్లు మొక్కిస్తే సమస్య పరిష్కారం అవుతుందా అని అన్నారు. కేంద్రప్రభుత్వం సహకారం అందించకపోవడంతో యూరియా ఇబ్బందులు ఎదురవుతున్నాయని విమర్శించారు. కొత్తగూడ, గూడూరు మండలాలకు చెందిన రైతులు కూడా ఖానాపురం వచ్చి యూరియా తీసుకోవడంతో సమస్యలు వస్తున్నాయని చెప్పారు. మహిళలను అడ్డుపెట్టుకొని రాస్తారోకోలు చేయడం సరికాదని హితువు పలికారు. కాంగ్రెస్‌పై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని, రైతులను రెచ్చగొట్టడం మానుకోవాలని సూచించారు. సమావేశంలో వెంకటప్రసాద రావు, ముస్తఫా, సాగర్‌రావు, ఎల్లగౌడ్, మోహన్‌రెడ్డి, రాజు, నవీన్, రాములు, కుమారస్వామి, కుమార్, లాల్‌సాహెబ్ ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



వర్ధన్నపేట: చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వర్ధన్నపేట : మండలంలోని చెన్నారం, ఇల్లంద, కట్ర్యాల, ఉప్పరపల్లి, కడారిగూడెం, నల్లబెల్లి, కాశాగూడెం గ్రామాల్లోని 27 మంది లబ్ధిదారులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. పేదలకు ఆపద కాలంలో సీఎంఆర్‌ఎఫ్ అండగా ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యం, పోశాల వెంకన్న, గ్రామ కమిటీ అధ్యక్షుడు కొలిపు రాజు, మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ, సయ్యద్ అబ్దుల్, దొమ్మాటి రాజు, అడ్డూరి బాలయ్య, సుధాకర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్వతగిరి : మండలంలోని దౌలత్‌నగర్ గ్రామానికి చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పర్వతగిరి మండల బీసీ సెల్ అధ్యక్షుడు బందెల వెంకన్న, కాంగ్రెస్ కమిటీ గ్రామ అధ్యక్షుడు కత్తుల వెంకటేశ్వర్లు బుధవారం పంపిణీ చేశారు. కిసాన్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడెపు కుమారస్వామి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బర్ల స్వామి, మాజీ కో ఆప్షన్ సభ్యుడు సర్వర్, కొమురయ్య, అశోక్, శివ తదితరులు పాల్గొన్నారు.

గీతకార్మికుల సంక్షేమానికి కృషి

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

రాయపర్తి: గీత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి పేర్కొన్నారు. శిక్షణ పొందిన కల్లుగీత కార్మికులకు మండల కేంద్రంలోని రైతువేదికలో కాటమయ్య రక్షణ కిట్‌లను ఎమ్మెల్యే బుధవారం పంపిణీ చేశారు. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కాటమయ్య కిట్‌లు భద్రత కోసం ఉపయోగపడుతాయని తెలిపారు. గీతకార్మికులు తమ భద్రతను విస్మరించకుండా తప్పనిసరిగా ఈ కిట్‌లు ఉపయోగించాలని కోరారు. మార్కెట్ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ తొర్రూరు అధ్యక్షుడు హామ్యా నాయక్, ఈదులకంటి రవీందర్‌రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు, కల్లుగీతకార్మికులు ఉన్నారు.

హామీలు నెరవేర్చాలి



పోస్టుకార్డులు పంపుతున్న ఉద్యమకారులు

ఖానాపురం : ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నందగిరి రజినీకాంత్ కోరారు. మండలంలోని మంగళవారిపేటలో బుధవారం కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ బుధవారం రాహుల్‌గాంధీకి పోస్టు కార్డులు పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యమకారుల హామీలను పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు పోశబోయిన సతీష్, బాధ్యులు ముత్తయ్య, ఐలయ్య, బాబు, లింగయ్య, వీరన్న, సైదులు, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



కార్యకర్తలతో మాట్లాడుతున్న కుమార్‌గౌడ్

రాయపర్తి : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపించేందుకు కార్యకర్తలు తమ సత్తాచాటాలని మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మైలారంలో మొరిపిరాల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ ముఖ్యకార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కుమార్‌గౌడ్ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పూస మధు, తాళ్లపెల్లి సంతోష్‌గౌడ్, గజవెల్లి ప్రసాద్,ఎల్లస్వామి, యాకూబ్‌రెడ్డి, మల్లేష్, కుమార్ పాల్గొన్నారు.

గీసుకొండ : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త కృషిచేసి సత్తాచాటాలని గీసుకొండ మాజీ జెడ్పీటీసీ పోలీసు ధర్మారావు అన్నారు. బుధవారం మండలంలోని దస్రు, నందనాయక్, హర్జ్యా తండాలతో పాటు గంగదేవిపల్లిలో నిర్వహించిన బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ మండల సమన్వయ కమిటీ సభ్యులు బోడకుంట ప్రకాశ్, ముంత రాజయ్య, చల్లా వేణుగోపాల్‌రెడ్డి, పూండ్రు జయపాల్‌రెడ్డి, అంకతి నాగేశ్వర్‌రావు, గుర్రం రఘు, కంబాల కోటి, సిరిసె శ్రీకాంత్, ప్రమోద్, లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైంది

- ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి

గీసుకొండ : ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైందని, నాగవెల్లి రవీందర్ బోధనా రంగంలో అందించిన సేవలు ప్రశంసనీయంగా ఉన్నాయని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం గీసుకొండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం నాగవెల్లి రవీందర్ ఉద్యోగ విరమణ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సన్మాన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం రవీందర్ దంపతులను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి



మధులత చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైద్యురాలు రహేలాతన్వీర్, ఆశ కార్యకర్తలు

పర్వతగిరి : మండలంలోని చింతనెక్కొండ గ్రామానికి చెందిన ఆశ వర్కర్ మధులత (39) మంగళవారం రాత్రి ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. మండలంలోని చింతనెక్కొండకు చెందిన మధులతను నెక్కొండ మండలం బంజరుపల్లికి చెందిన తడుగుల భాస్కర్‌కి ఇచ్చి వివాహం చేశారు. నాలుగేళ్ల క్రితం భార్యభర్తల మధ్య గొడవలతో మధులత తల్లి గారి ఇళ్లు అయిన చింతనెక్కొండలో ఉంటుంది. ఈ క్రమంలో జూలై 24వ తేదీన కుటుంబ సమస్యలతో గడ్డి మందు తాగగా గమనించిన కుటుంబ సభ్యులు ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి ఆమె మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆమె భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆశ కార్యకర్తకు నివాళి

నెక్కొండ : మండలంలోని చంద్రుగొండలో ఆశ కార్యకర్తగా విధులు నిర్వర్తిస్తున్న మధులత మృతిచెందడం బాధకరమని నెక్కొండ పీహెచ్‌సీ వైద్యాధికారి రహేలాతన్వీర్ అన్నారు. బుధవారం మధులత చిత్రపటానికి పూలమాల వేసి వైద్య సిబ్బంది నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పీహెచ్‌సీకి చెందిన మధులత కుటుంబ కలహాలతో ఇటీవల గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడి, చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. విధుల పట్ల నిబద్ధతతో పని చేసే కార్యకర్తను కోల్పోవడంపై విచారం వ్యక్తం చేశారు. పీహెచ్‌సీ వైద్యులు సుమన్, వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



మధులత మృతదేహం

నూతన పింఛన్ అమలు చేయాలి



రాయపర్తి: నినాదాలు చేస్తున్న నాయకులు



పర్వతగిరి: మాట్లాడుతున్న ఆనందరావు

రాయపర్తి : అధికారం చేపట్టిన వెంటనే నూతన పింఛన్ విధానాన్ని అమలు చేసి పెంచుతామని చెప్పి ఆలస్యం చేయడమేంటని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ మండల ఇన్‌చార్జ్ జిల్లా ధర్మయ్య మాదిగ ప్రశ్నించారు. బుధవారం మండలంలోని పెర్కవేడు గ్రామంలో ఎమ్మార్పీఎస్ కమిటీ నాయకుడు గారె ప్రవీణ్ అధ్యక్షతన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మయ్య పాల్గొని మాట్లాడారు. ఈనెల 28న వర్ధన్నపేట పట్టణంలో జరిగే సభకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప ద్మశ్రీ మంద కృష్ణమాదిగ హాజరవుతున్నారని అ ధిక సంఖ్యలో పింఛన్‌దారులు పాల్గొనాలని పి లుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు గారె సోమయ్య, వేల్పుల కు మార్, ఐత వీరస్వామి, గారె కుమార్, తాటికా య ల మహేందర్, గారె సంతోష్, వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు తదితరులు పాల్గొన్నారు.

మహాసభను జయప్రదం చేయాలి

పర్వతగిరి : వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రంలో ఈనెల 28వ తేదీన నిర్వహించే దివ్యాంగులు, వృద్ధులు, వితంతువుల సన్నాహక మహాసభను జయప్రదం చేయాలని ఎంఎస్పీ జాతీయ నాయకులు, జిల్లా ఇన్‌చార్జ్ వంగూరి ఆనందరావు పిలుపునిచ్చారు. మండలంలోని కల్లెడలో బుధవారం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బర్ల యాకయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మహాజన సోషలిస్టు పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మెర రాజు, పర్వతగిరి టౌన్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు చిన్నపల్లి వెంకన్న, కల్లెడ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు నక్క రాజు, దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, ఆసరా పెన్షన్‌దారులు పాల్గొన్నారు.

రాజీవ్ గాంధీ సేవలు చిరస్మరణీయం



నెక్కొండ: రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రంజిత్‌రెడ్డి, చిత్రంలో కాంగ్రెస్ నాయకులు

సాక్షి నెట్‌వర్క్ : భారతరత్న, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ దేశాభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ పార్టీ నాయకులు కొనియాడారు. జిల్లావ్యాప్తంగా బుధవారం రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐటీ రంగానికి పునాదులు వేసిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కుతుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఖానాపురం: రాజీవ్‌గాంధీ జయంతి వేడుకల్లో..



వర్ధన్నపేట: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో..



నర్సంపేటలో..

బాధిత కుటుంబాలకు పరామర్శ



నెక్కొండ: పరామర్శిస్తున్న శ్రీపాల్‌రెడ్డి తదితరులు

నెక్కొండ : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చల్లా పాపిరెడ్డి తల్లి లక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. అనంతరం లక్ష్మి చిత్రపటం వద్ద నివాళులర్పించి, ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. పీఆర్టీయూ టీఎస్ వరంగల్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈదునూరి రవీందర్‌రెడ్డి, నకిరెడ్డి మహేందర్‌రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మంద తిరుపతిరెడ్డి, ఫలిత శ్రీహరి, మండల అధ్యక్షుడు మాలోతు ప్రతాప్‌సింగ్, నాయకులు అబ్దుల్‌గఫార్, పింగిలి విజయపాల్‌రెడ్డి, రాపోలు యాకయ్య, మార్త శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నల్లబెల్లి : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఎండీ సర్వర్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు బత్తిని మహేష్ ఆధ్వర్యంలో పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు.అశోక్, పరికి పవన్, మురికి రవి, బాషబోయిన సమ్మయ్య, రమణాచారి, గాజు భిక్షపతి, కనకం సాల్మన్, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పోచమ్మ బోనాలు





బోనంతో వెళ్తున్న మహిళ, శివసత్తుల విన్యాసం

నర్సంపేట : మండలంలోని పలు గ్రామాల్లో పోచమ్మ బోనాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. బోనం తయారు చేసుకొని మహిళలు అమ్మవారి ఆలయానికి చేరుకుని, నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. శివసత్తుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి.సకాలంలో వర్షాలు కురవాలనివేడుకున్నారు.